క్లుప్తంగా

ఘనంగా శ్రీపాద శ్రీవల్లభుని జయంతి



ఔదంబర పీఠంలో జరుగుతున్న హోమం

అనపర్తి: స్థానిక ఔదంబర దత్త పీఠంలో శ్రీపాద శ్రీవల్లభుని జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం గురుస్వామి మల్లిడి సత్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు నరసింహమూర్తి సిద్ధ మంగళ స్తోత్ర హోమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. గురువారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు.

అడబాల కుటుంబానికి పలువురి పరామర్శ



చక్రం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రంగంపేట: దొడ్డిగుంట గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ అడబాల శ్రీనివాస్ సోదరుడు అడబాల చక్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. చక్రం మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, నాయకులు అడబాల మరిడయ్య కాపు, కొండేపూడి పెద వెంకన్న, దావీదు, మడికి లాజరు, ఉలిసే నాని, త్రిమూర్తులు, భావన వెంకటేష్, అడబాల ప్రసాద్ ఉన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

పెదపూడి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్, వార్షిక మరమ్మత్తుల పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. ఆ సమయంలో జి.మామిడాడ, రాజుపాలెం, పైన, వేండ్ర, పెద్దాడ, కుమారప్రియం, కైకవోలు గ్రామాలకు సరఫరా ఆగిపోతుందన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



సారా విక్రేతలను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: మండలంలోని మర్రిపూడి, దొడ్డిగుంట గ్రామాల్లో గురువారం దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఈ సందర్భంగా సారా విక్రయిస్తున్న బోడ రామలక్ష్మి, టేకుమూడి దుర్గారావులను అరెస్టు చేసి, వారి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

రూ.60 లక్షల బంగారం, నగదు చోరీ

రాజానగరం: ఎవ్వరూ లేని సమయంలో ఇంటిలోని రూ.60 లక్షల విలువైన బంగారం, నగదును దొంగలు మాయం చేశారు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దివాన్‌చెరువులోని డీవీబీ రాజు లేఅవుట్‌లో గల ఒక అపార్టుమెంట్ మొదటి అంతస్తులో క్యానం అన్వేష్ ఉంటున్నాడు. ఆయన ఒక ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఎంబీబీఎస్ పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లో ఉంటూ ఇక్కడకు వచ్చి వెళుతుంటుంది. కాగా.. అన్వేష్ తల్లి నెల రోజుల క్రితం మృతి చెందింది. ఆమె అస్థికలను కాశీలో కలిపేందుకు తండ్రితో కలిసి ఈ నెల 24న అన్వేష్ వెళ్లాడు. అక్కడి నుంచి బుధవారం తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరచి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువాలో దాచిన 59 కాసుల బంగారు నగలు, రూ.7.50 లక్షలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదుపై ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేశారు.

స్వామిత్వ సర్వేను సత్వరమే పూర్తి చేయాలి

సీతానగరం: స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలని డీఎల్‌పీవో నాగలత సూచించారు. చినకొండేపూడి పంచాయతీని గురువారం ఆమె సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఎనిమిది గ్రామాల్లో నిర్వహించే ఈ సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.భారతి, డిప్యూటీ ఎంపీడీవో కేవీఎస్ఎస్ మూర్తిలకు తెలిపారు.



సీతానగరం పెంద్యాల వారి వీధిలో ఏర్పాటు చేసిన విజయ గణపతికి పూజలు చేస్తున్న భక్తులు



పెదపూడి గ్రామంలో గణనాథుని దర్శించుకుంటున్న భక్తులు



రంగంపేటలో వినాయకుడికి నమస్కరిస్తున్న భక్తులు

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా

- కొలువుదీరిన వినాయకుడు
- వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- భక్తిశ్రద్ధలతో నవరాత్ర ఉత్సవాలు



అనపర్తిలోని మార్కండేయపురంలో స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



అనపర్తిలోని కుమ్మరివీధి వినాయకుడు



ధరణికోటలో పూజలందుకుంటున్న సంపత్ వినాయక స్వామి

అనపర్తి: దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా అంటూ ఆ వినాయకుడిని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆహ్వానించారు. వాడవాడలా మండపాలు కట్టి ఆయనకు స్వాగతం పలికారు. పలు ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అనపర్తిలోని మార్కండేయపురంలో ఉన్న భావనారుషి ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా నియోజకవర్గ వ్యాప్తంగా గణపతి నవరాత్ర ఉత్సవాలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. కానూరి కృష్ణ, నామాల సత్యనారాయణ, కోటసత్తి వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

- ధరణికోటలోని కనక మహాలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద సంపత్ వినాయక స్వామి ఆలయంలో 16వ వార్షిక నవరాత్ర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ చిర్ల సతీష్ రెడ్డి, సంతోషి పావని దంపతుల చేతుల మీదుగా స్వామివారికి అభిషేకాలు, కలశ స్థాపన, శ్రీలక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. సీతానగరం పెంద్యాల వారి వీధిలో ఏర్పాటు చేసిన విజయ గణపతికి పెండ్యాల వెంకటేశ్వరరావు, సుజాత దంపతులు, సుంకవల్లి బ్రహ్మానందం, విజయలక్ష్మి దంపతులు, గంటా సూర్య ప్రకాష్, పద్మావతి దంపతులు, బొమ్మనబోయిన మహేష్, శాంతారాణి దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు.

- సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో దుర్గాభవాని వర్కర్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గణపతి విగ్రహం నెలకొల్పి.. విగ్రహ దాత జామి రాంబాబు, నాగమణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చిడిపి బంగారయ్య, షేక్ అమీర్ జాన్, ఈతకోట గంగాధర్ పాల్గొన్నారు.
- చినకొండేపూడి, సీతానగరం, వంగలపూడి, సింగవరం, రామచంద్రపురం, పురుషోత్తపట్నం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంక, జాలిమూడి, ములకల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, కూనవరం, నాగంపల్లి, చీపురపల్లి గ్రామాల్లో నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

వైభవంగా వేడుకలు

రంగంపేట: మండలంలోని 17 గ్రామాల్లో ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి, వ్రత కథను చదివి, ప్రసాద వితరణ చేశారు.

- రంగంపేట ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా గల లక్ష్మీగణపతి ఆలయంలో మహాన్నదానం నిర్వహించారు. రంగంపేటలోని బీసీపేట రామాలయం దగ్గర గల శివాజీ గణేష్ విగ్రహం ఆద్యంతం ఆకట్టుకుంది. స్థానిక ఎర్ర సత్యనారాయణ కుమారుడు అశోక్, వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు.
- వడిశలేరులో రూపాయి గణపతి, సూర్యనారాయణపురం గణేష్ మహారాజ్ విగ్రహాలను అలంకరించి పూజలు, భజనలు చేశారు.

అంగరంగ వైభవంగా..

పెదపూడి: వినాయక చవితి వేడుకలు మండలంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన కూడళ్లలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. వాటితో పాటు ప్రధాన ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. జి.మామిడాడ, పెదపూడి, రామేశ్వరం, ఏపీత్రయం, పెద్దాడ, సంపర, కాండ్రేగుల తదితర గ్రామాల్లో విగ్రహాలు ఆకట్టుకున్నాయి.

పౌరుల సంతృప్తిని దృష్టిలో పెట్టుకోవాలి

రంగంపేట: పౌరుల సంతృప్తిని దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వర్తించాలని రాజమహేంద్రవరం రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్.కృష్ణ నాయక్ సూచించారు. ఆయన గురువారం రంగంపేట తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న పట్టాదార్ ఫొటో అప్ లోడింగ్ పనులను పరిశీలించారు. అనంతరం డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ, నిత్యావసర సరకుల పంపిణీపై క్షేత్ర స్థాయిలో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీవో వి.వీర సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతి అవసరం

కోరుకొండ: మండల కేంద్రమైన కోరుకొండ పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న భవనాలకు పంచాయతీ ద్వారా అనుమతులు పొందాలని సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ పాలక మండలిపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, ఇతర అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రూ.25 లక్షల ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉండగా, అధికారులు తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు.

టీచర్ మంజులకు శిక్షారత్న అవార్డు



రాజానగరం: మండలంలోని పుణ్యక్షేత్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పన్యాల మంజుల 2025 సంవత్సరానికి గాను శిక్షారత్న అవార్డుకు ఎంపికయ్యారు. 30 సంవత్సరాల బోధనా అనుభవంతో ఆంగ్ల భాష అభ్యసనకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేశారని హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ క్రైమ్ అసోసియేషన్ నేషనల్ చైర్మన్ బొడా రాకేష్ నాయక్ తెలిపారు. అలాగే వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారిని కూడా గుర్తించి శనివారం విశాఖపట్నంలో అవార్డులను అందజేస్తారన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెదపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం ఉపాధి హామీ పథకం 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ గురువారం తెలిపారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31 వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

1,400 క్యూసెక్కుల నీరు విడుదల

సీతానగరం: పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా 1,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని జలవనరులశాఖ ఏఈ జి.సుమంత్ గురువారం తెలిపారు. పురుషోత్తపట్నంలోని పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి నాలుగు మోటార్ల ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నామన్నారు. పోలవరం ఎడమ కాలువ పనులు జరుగుతున్నందున, పుష్కర కాలువ నుంచి సాగునీటిని విడుదల చేస్తున్నామన్నారు. గోదావరి నీటిమట్టం 20.2 మీటర్లు ఉందని తెలిపారు.

భక్తశ్రద్ధలతో గురు చరిత్ర పారాయణ

రాజానగరం: ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో సాయి భక్త మండలి ఆధ్వర్యంలో చేపట్టిన 11 గురువారాల గురు చరిత్ర పారాయణ యజ్ఞం 8వ వారానికి చేరుకుంది. తెల్లవారుజాము కాకడ హారతి అనంతరం ఉదయం 6 గంటలకు పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నం 2.30 గంటలకు పూర్తి చేశారు. ఇదే విధంగా మరో మూడు గురువారాలు గురు చరిత్ర, ఒక గురువారం సాయి సచ్చరిత్ర పారాయణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు ఈ పారాయణలో పాల్గొని, తమ సమయానుకూలతను బట్టి కొన్ని అధ్యాయాలను పఠనం చేయవచ్చన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు సమర్పించే విరాళాలతో నిర్వహించిన అన్నసమారాధనలోనూ రద్దీ ఎక్కువగానే ఉంది.

ఈ దారిలో అడుగుకో మడుగు

- వర్షాలతో గోతుల్లోకి చేరిన నీరు
- వాహన చోదకుల అవస్థలు



పురుషోత్తపట్నం - రామచంద్రపురం మధ్యలో ఏటిగట్టు రోడ్డుపై ఏర్పడిన గోతులు

సీతానగరం: సీతానగరం - పురుషోత్తపట్నం ఏటిగట్టు రోడ్డుపై ఏర్పడిన గోతులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు వాటిలో నీరు చేరి, చెరువులను తలపిస్తున్నాయి. సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకూ సుమారు పది కిలోమీటర్ల రోడ్డు పూర్తిస్థాయిలో శిథిలమైంది. ప్రతి అడుగుకు ఓ గొయ్యి ఉండడంతో వాహన చోదకులకు అవస్థలు ఎదురవుతున్నాయి. ఈ రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరయ్యారని అధికారులు చెబుతున్నారు. అయితే ఈలోపు గోతులను పూడ్చి వాహనాల రాకపోకలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ గోతులను తప్పించే ప్రయత్నంలో వాహన చోదకులు పలు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఈ దారిలో రాకపోకల కారణంగా ఆర్టీసీ బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయి. ముఖ్యంగా సీతానగరం, సింగవరం, వంగలపూడి, రామచంద్రపురం, పురుషోత్తపట్నం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకూ పది కిలోమీటర్లు ఏటిగట్టు రోడ్డుపై పడిన గోతులకు తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు



పంట మార్పిడితో అనేక ప్రయోజనాలు

- రసాయనాల ఖర్చు తగ్గుదల
- తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షణ



నారుమడిలో ఆకు తీస్తున్న కూలీలు



వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

రంగంపేట: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పొలాలు దున్నడంలో రైతులు నిమగ్నమయ్యారు. అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి మండలంలో 12 వేలు, పెదపూడిలో 18,500, బిక్కవోలులో 13 వేలు, రంగంపేటలో 11,500 ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. అయితే ఏటా ఒకే రకమైన పంటలు పండించడం వల్ల భూమి నిస్సారంగా మారి వ్యవసాయంలో ఆశించిన ఫలితాలు ఉండడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు.

సారవంతం

పంట మార్పిడితో దిగుబడి పెరగడమే కాకుండా భూమి సారవంతమవుతుంది. ఏటా ఒకే రకమైన పంటలు సాగుచేస్తే ఈ ప్రయోజనం కలగదు. భూమి నిస్సారంగా మారి తెగుళ్లు, చీడపీడల సమస్య ఎదురవుతుంది. ముఖ్యంగా పంట మార్పిడిలో భాగంగా నేలంతా కప్పేలా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల పంటలో కలుపు మొక్కలు ఎక్కువ రాకుండా ఉంటాయి. నేల భౌతిక స్థితిలో కూడా మార్పు వస్తుంది. భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి వృద్ధి చెంది చీడ పీడలు దూరమవుతాయి. ఫలితంగా పంటల రక్షణకు ఉపయోగించే రసాయన ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.

భూమికి మేలు చేసే పంటలు

పంటల మార్పిడిలో భాగంగా కందులు, మినుములు, సజ్జలు, పెసలు, ఉలవలు వంటి వివిధ రకాల పంటలు సాగు చేయడంతో వాటి వేర్లు భూమి నుంచి పోషకాలను సులభంగా తీసుకుంటాయి. కొంత మేర నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటాయి. ఈ పంటల వేరు మొదళ్లు నత్రజనిని స్థిరీకరిస్తాయి. వీటిని సాగు చేయడంతో చాలా వరకు రాలిన ఆకుల రూపంలో సేంద్రియ ఎరువు లభిస్తుంది.

లాభదాయకం

ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడంతో కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు పంటను ఆశించి వృద్ధి చెందుతాయి. దీనివల్ల పంట దిగుబడి కూడా చాలా వరకు తగ్గిపోతుంది. ఈ క్రమంలో ఏటా సాగు చేసే పంటను కాకుండా మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు వరసగా వరి పంట సాగు చేయకుండా పప్పు దినుసులు, పువ్వులు వంటి పంటలు సాగు చేసుకుంటే మేలు జరుగుతుంది. మినుము, శనగ తదితర పంటలను లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, రాగులు తదితర ఆరుతడి పంటలతో మార్పు చేయాలి. వరిని సాగు చేసే పొలానికి ముందుగా జనుము వేస్తే సేంద్రియ ఎరువుగా తయారై పంటకు మంచి దిగుబడి ఉంటుంది. మొత్తంగా రైతులు పంట మార్పిడి వ్యవసాయం చేయడం లాభదాయకంగా ఉంటుంది.

అధిక దిగుబడి



పంట మార్పిడితో దిగుబడి పెరుగుతుంది. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, రాగులు సాగు చేస్తే భూమి సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో జనుము వేసి బాగా దున్నితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాగులు, మినుములు, శనగలు, సజ్జలు వంటి పంటలకు మంచి గిరాకీ ఉంది.

– కె.శ్రీనివాసరావు, ఏఓ, రంగంపేట మండలం